# గిరిజనుల దేవతాస్థలాలు గుర్తించండి - సుప్రీంకోర్టు ఉత్తర్వులు

– పి. శివరామకృష్ణ (శక్తి)

ఒరిస్సాలోని గిరిజనప్రాంతాలలో నియంగిరి కొండలలోగల బాక్సైట్‌ఖనిజం తవ్వుకోడానికి ఆ రాష్ట్రప్రభుత్వం వేదాంత కంపెనీకి అనుమతినిచ్చింది. పర్యావరణశాఖ ప్రాథమిక అనుమతి మంజూరు చేసింది. ఇక్కడి కడుపేద గిరిజనతెగ డొంగరియా/కొటియా, కోంధులు నియంగిరి అధిదేవత 'నియంరాజు'ను భయభక్తులతో పూజిస్తారు. ఈ కొండలు వారి జీవనాధారం. వారు నివసించే ఈ కంధమలలు సుబ్రహ్మణ్యస్వామి నివసించే 'స్కంధమలలు'గా పురాణప్రశస్తి పొందాయి. ఖనిజం తవ్వకాలను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన ఉద్యమం అంతర్జాతీయస్థాయిలో మద్దతు సంపాదించుకొంది. అంతదాకా వేదాంత కంపెనీ షేర్లను గణనీయంగా కొంటున్న విదేశాల్లో క్రైస్తవ ధార్మిక సంస్థలు తమ వాటాలను ఈ ఉద్యమానికి మద్దతుగా ఉపసంహరించుకొన్నాయి. ఆదివాసీల మనుగడను వారి సంప్రదాయాలను ఈ తవ్వకాలు దెబ్బతీస్తాయని అనేక వేదికలమీద ప్రకటనలు చేశాయి. చివరకు రాహుల్‌గాంధీ నియంగిరి వెళ్ళి గిరిజనులకు తన మద్దతు తెలియజేస్తూ – నేను మీ సిపాయిని – మీకోసం పోరాటం చేస్తాను అని ప్రకటించారు. అంతకు ముందురోజే భారతప్రభుత్వం పర్యావరణ అనుమతులు రద్దు చేసింది. వేదాంత కంపెనీ కోర్టుకెక్కింది. 'అటవీహక్కుల గుర్తింపు చట్టం కింద వ్యక్తిగత ఉమ్మడిహక్కులను గుర్తించేటపుడు వారి పూజాస్థలాలను గుర్తించలేదు. గ్రామసభద్వారా ఆ స్థలాలను గుర్తించండి అని సుప్రీంకోర్టు 15రోజుల క్రితం ఆదేశాలు జారీ చేసింది.

నియంగిరి ప్రాంతంలో పనిచేసే 'లివింగ్ ఫామ్స్' అనే సంస్థ సంచాలకుడు దేవాదత్ పిలుపుమేరకు నేను రెండేళ్ళక్రితం అటవీహక్కుల గుర్తింపులో శిక్షణనివ్వడానికి ఆ గిరిజన గ్రామాలకు వెళ్ళాను. దగ్గర వున్న తాలూకా కేంద్రం బిస్సంకటక్‌లో క్రైస్తవ సంస్థలు నిర్వహించే ఒక ప్రసిద్ధమైన ఆసుపత్రి ఉంది. వేదాంత కంపెనీ సాయంతో స్థానికులు దసరా ఉత్సవాలను నిర్వహించడం నేను గమనించాను. 25 యేళ్ళక్రితం సంబల్‌పూర్ దగ్గర మార్జాలరూపంలో నరసింహస్వామి వెలసిన నర్సింగ్‌నాథ్ కొండలను బాక్సైట్ కోసం తవ్వడానికి ప్రయతించారు. సుందర్‌లాల్ బహుగుణ మొదలైన పర్యావరణవేత్తలంతా ప్రతిఘటించారు. అంతటితో ఆ ప్రయత్నం ఆగిపోయింది. నర్సింగ్‌నాథ్ గొప్ప యాత్రాస్థలం, పుణ్యక్షేత్రం. నియంగిరి స్థానిక ఆదివాసులు పూజించే కొండదేవర. నర్సింగ్‌నాథ్‌తో పోలిస్తే ఏ విధంగాను బయటివారి లెక్కలోకిరాని గ్రామదేవత. కాని ఇంత పెద్ద ఉద్యమంలో రాజయకీయాలు ఏమైనప్పటికీ, గుళ్ళు గోపురాలు భారీగా పూజలు పునస్కారాలకు, మంత్రతంత్రాలకు అలవాటుపడిన మనం, గిరిజనులు తమ విశ్వాసాలపట్ల ఎంత తీవ్రంగా స్పందిస్తారో తెలుసుకోలేనందుకు నిజంగా సిగ్గుతో తలవంచుకోవాలి. ఆ స్వాభిమానంతోనే వారు తమను కించపరచినపుడల్లా తిరగబడ్డారు.

అందువల్లనే గిరిజన తిరుగుబాట్లు(Tribal Revolts) రైతాంగ ఉద్యమాలు(Peasant Moments) అంటూ ఈ ప్రతిఘటనలలో తరతమ భేదాలను చరిత్రకారులు వర్తిస్తారు. మంత్రాలు మాయలు కృత్రిమవిలువలంటే వారికిగల ఏవగింపును పూరిజగన్నాథ్, శ్రీముఖలింగం స్థలపురాణాలు స్పష్టం చేస్తాయి.

మనం రాష్ట్రంలో అటవీహక్కుల చట్టం అమలు ప్రారంభిస్తు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అధ్యక్షతన ఫిబ్రవరి 2008లో పెద్ద సమావేశం జరిగింది. వాటిలో ఒక ఉపసదస్సుకు నేను అధ్యక్షత వహించగా, రంపచోడవరం గిరిజనాభివృద్ధి సంస్థ అధికారిణి శ్రీమతి యోగితారాణా సమన్వయకర్తగా వ్యవహరించారు. గిరిజన సంప్రదాయ సరిహద్దులతో గ్రామపటం తయారు చేసి ఆయా స్థలాలను గుర్తిద్దాం అన్న నా ప్రతిపాదన ఆమోదించి అమలులో పెట్టడానికి గిరిజనులకు తమ సిబ్బందికి శిక్షణ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేను వ్రాసిన కరపత్రం ప్రచురించారు. ఆ కరపత్రంలో తూర్పుగోదావరిలో కొండరెడ్ల గిరిజన సంప్రదాయ పరిభాషకు ('చేవడిబస, మగనాలిమెట్ట, చీపురుపోలాలు' మొ॥) రాష్ట్రవ్యాప్తంగా పంచిపెట్టిన పట్టాదారుపాస్ పుస్తకాలమీద ముద్రించారు.

ఈ చట్టం అమలు తీరుతెన్నులను చర్చించడానికి గిరిజన సంక్షేమశాఖ నిర్వహించిన సమావేశంలో ఆ పాస్‌పుస్తకం చూపిస్తూ ఈ ఉమ్మడివనరులు, దేవతాస్థలాలు గుర్తించలేదు అని నేను నిలదీసేసరికి, అధికారులు గతుక్కుమన్నారు. వెంటనే అన్ని జిల్లాలనుండి ఆయా తెగల వాడుకలోగల పేర్ల సేకరించి వాటిని గుర్తించవలసిందిగా జనవరి 2011లో ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కాని జిల్లాల్లో ఈ ఉత్తర్వులను పట్టించుకున్నవాడే లేడు.

మన రాష్ట్రంలో గోండ్, కోయ, సవర, సుగాలీ, ఎరుకల మొదలైన తెగలవారికి వారి భాషలు వేరే ఉన్నాయి. ఉదాహరణకు ఈ ఉత్తర్వులో అదిలాబాద్‌లో గల గోండుతెగవారి ఉమ్మడివనరులు, పూజాస్థలాలు ఇలా పేర్కొన్నారు.

1. సివారం– గ్రామసరిహద్దు
2. భీమల్‌మఠం – ఊరిబయట భీమున్ని పూజించే చోటు, చెంచిభీమల్ పండుగ చేస్తారు.
3. అక్కిపెన్‌మఠం – ఊరిమధ్యలో బస పండుగలు.
4. అవ్వల్‌పెన్(మర్కేయాయల్‌మఠం) – ఊరిమధ్యలో బస పండుగలు.
5. అకాడిమఠం – ఊరిబయట అడవిరాజులకు, దేవతలకు పండుగ చేసే స్థలం.
8. దురాడి – హోలిపండుగలో మాతరి, మాత్రాల్ దేవతలను ఊరిబయట నిమజ్జనం చేసే చోటు.
9. అస్తితిన్‌వాల్‌జాగ – భూలక్ష్మి పండుగలో అందరు కలిసి వండుకుని తినే చోటు.
10. దసర కైదతజాగ – దసరలో ఊరిబయట పండుగ చేసుకునే చోటు.
11. కోర్‌మరతజాగ – ఊరిబయట దినకార్యాలు చేసే స్థలం చెట్టు.
13. గోవర్ధన్‌గోటాన్ – ఊరిమధ్యలో పెళ్ళిళ్ళు చేసుకునే వేదిక.
14. పెన్‌గధ/సాతిక్‌మఠం – పెద్దదేవుడు, పెర్సాపెన్‌ను పూజించే చోటు.
15. మహదేవ్‌మఠం – మహదేవుని పూజించే చోటు.
16. జంగులింగుమఠం – జంగులింగు దేవతలను పూజించే చోటు.
17. బేతాల్‌పెన్ – భూతాలరాజు భేతాలున్ని పూజించే చోటు.

ఇవికాక ఇతర తెగలు తోటి, పరధాన్, కొలాం, నాయక్‌పోడ్, సుగాలితెగలవారి దేవతలకు వేరే జాగాలుంటాయి. గిరిజనులకు పవిత్రమైన చెట్లు: ఆరె, ఇప్ప, వేప, మర్రి, మారేడు, అందుగు, రేల, మోదుగ వగైరాలు. ఇలాగే ఉత్తరాంధ్రంలోని గిరిజన తెగలలో జాకరిమెట్ట, దానవుడిమెట్ట, సందమ్మబస, ఆగంపండుగబస, నందిపుట్ట, వేలంబస ఇలా రకరకాల దేవతాస్థలాలు ఉన్నాయి.

పెద్దపెద్ద జాతరలు జరిగే చోట్లు: అర్జునలోద్ది, కోటపరండోళి, రొంపెల్లిలలో జంగుబాయిజాతర; గుడిరేవులో పద్మాల్‌పురికాక జాతర; లక్సెట్టిపేట మండలంలో చిన్నయ్య పెద్దయ్య గుట్టలు; మందమర్రి మండలంలో గాంధారిమైసమ్మ; బెజూరిమండలంలోని సురుగుపల్లి గ్రామంలో జంగునాబియారి, రంగసానిబియారి జాతరలు; దేవాయగూడలో బొనికిమెట్టలో రాజులపండుగ; కెరమరిమండలం ఇందపూర్‌లో పోతురాజు జాతర; కేసలాపూర్‌లో నగోబా జాతర; గడేపల్లిలో పావన్‌మడుగు జాతర.

గిరిజనులలో ఉన్న సంప్రదాయాలు అంతనిగూఢమైనవేమీ కావు. జాతులు, తెగలు, వెనకబడిన తరగతుల్లోని కొన్ని సామాజిక వర్గాలలో, సంచారజాతులలో, మన పల్లెల్లో ఈ దేశి సంప్రదాయాలు కనిపిస్తాయి. 'కప్పతల్లి నీళ్ళాదే' అని వర్షాలు పడకపోతే జలదేవతలకు మొక్కడం, పుట్టిన బిడ్డకు జలగండం లేకుండా తల్లిచేత 'నూతిలో చాద వేయించడం' వంటి ఆచారాలు, కట్టమైసమ్మ, కోటమైసమ్మ, గట్టుమైసమ్మ, పోచమ్మ, పోతురాజు, అంకాళమ్మ, మంతనాలమ్మ మొదలైన వివిధ వనరులకు దేవతలకు జాతరలు, స్థానికంగా ఒక్కో దేవతకు అందరికి తెలిసిన ఒక కథ, పూజా పద్ధతి ఉంటుంది. సామాజిక వర్గాలవారిగా చెల్లించవలసిన మర్యాదలుంటాయి.

ధార్మికరంగంలో పనిచేసేవారికి ఈ దేశిసంప్రదాయాలపట్ల ఆసక్తి ఉండదు. వారు పురాణాల దేవతలకు – స్థానిక దేవతలకు బాదరాయణ సంబంధాలు కలుపుతూ కథా కాలక్షేపాలు నిర్వహిస్తూ, స్థానికంగాగల ప్రత్యేకతను పట్టించుకోరు. ఈ ఉత్సవాల్లో కొందరు పాల్గొంటుంటే, అడవికి, నీటికి, పంటలకు మొక్కే పల్లెప్రజలు, గిరిజనులందరు తమ పండుగలను తమ కట్టుబాట్ల ప్రకారం చేసుకుంటారు. తెలుగు మాతృభాషగాగల గిరిజనుల పండుగపాటల్లో దేవతల పిలుపులు తలుపులు శ్రద్ధగా వింటే ఈ పద్ధతులు మనకు సులభంగా అర్థం అవుతాయి. ఉదా: విశాఖమన్యం నందిపండుగలో 'పాండవదేశం పాటపూజారులు' కొండదొరలు దేవతలను ఇలా ఆహ్వానిస్తారు.

జోర జోర జోర – పంచ పాండవులార॥
తొక్కిన భూదేవత – తోడుగాయవలె
మట్టిన భూదేవత – మనసు గాయవలె

లోతుగడ్డనున్న – వీరభద్రుడ
లంబసింగినున్న – బాలరాకాసమ్మ
బోడకొండనున్న – శాంబరమ్మ నీవు
మాడుగులనున్న – మత్స్యకంబేరమ్మ
కొండకంబేరున్న – నీలకంఠుడ
అప్పయేడుగురు – జలగన్నికలు

విరటివారి దేశము – విటిక పండుగలు
కాశివారి దేశము – గంగపండుగలు
కొండవారి దేశము – కొలువు పండుగలు
పిట్టగడ్డ జలంపల్లి – పట్టపు కోలన్న
లే లే లేరన్న – లేకోలన్న
మిందెగురువన్న – తొండగురువన్న
బల్లిగురువన్న – ముంగిగురువన్న
చేరిరండు బాబు – దేవగురువులార

సురటికొండలలోన – సురదానుడట
బందలగిరిలోన – బట్టదానుడట
కొండనున్నవాడు – కొండదానుడట
గడపనున్నవాడు – గడపదానుడేమొ
కొర్రవారల్లుడు – కొండదానుగుడు
బిడ్డిగవారల్లుడు – భీమసేనుడు
దానుడు భీముడు – బావమరదులట

రిజర్వు అడవిలో ఉన్న దేవతాస్థలాలను చట్టప్రకారం శ్రద్ధగా గుర్తించకపోతే ముందు ముందు వారు ఆ ప్రదేశాలమీద హక్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. ఒక్కొసారి పెద్ద గొడవలకుకూడా దారితీయచ్చు. ఈ స్థలాలను వాటికి సంబంధించిన సంప్రదాయాలను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. అడవితల్లిని కాపాడుకుందాం.